క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 11న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. ఆర్టీసీ కాలనీలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు, న్యూశాయంపేట వ్యవసాయ క్షేత్రాలకు, భట్టుపల్లి రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాం



కాజీపేట అర్బన్: న్యూశాయంపేటలోని రైల్వే గేట్ వద్ద రైలు ఢీకొని మృతి చెందిన పోశాలు కుటుంబాన్ని ఆదుకునేందుకు వివరాలను ప్రభుత్వానికి అందజేస్తామని పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కేవీ.నారాయణ తెలిపారు. ఈమేరకు బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందేవిధంగా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాజీపేట వెటర్నరీ డాక్టర్ కర్ణాకర్, గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి లింగయ్య, వేల్పుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సుమన్‌శర్మకు జ్యోతిష్య బ్రహ్మ అవార్డు



రామన్నపేట: వరంగల్ రామన్నపేటకు చెందిన డాక్టర్ సుమన్ శర్మకు జ్యోతిష్యబ్రహ్మ అవార్డు అందించి సన్మానించారు. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో ఆదివారం నిర్వహించిన ఇంటర్నేషనల్ ఆస్ట్రాలజీ ఫెడరేషన్, ఆస్ట్రాలజీ రీసెర్చ్ సెంటర్ సదస్సులో అవార్డును ప్రదానం చేశారు. 25ఏళ్లుగా జ్యోతిష్యంలో వాస్తు, పలు అంశాల మీద సుమన్ శర్మ పరిశోధనలు చేస్తున్నారు. సుమన్ శర్మ అవార్డుకు రావడంపై పలువురు జ్యోతిష్య పండితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా భీమాచారి




కాశిబుగ్గ: తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం సహాయ కార్యదర్శిగా కాశిబుగ్గకు చెందిన జక్కోజు భీమాచారిని నియమించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్, చొల్లేటి కృష్ణమాచారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశ్వబ్రాహ్మణుల సాంప్రదాయ వృత్తుల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పోలీస్ అధికారి తీరుపై జర్నలిస్టుల నిరసన

వరంగల్ చౌరస్తా: వరంగల్ ఎస్ఎన్ఎం క్లబ్‌కు సమీపంలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలో భాగంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో వీడియో జర్నలిస్టులపై ఓ పోలీస్ అధికారి తీరును నిరసిస్తూ జర్నలిస్టులు నిరసన తెలిపారు. మంత్రులకు సంబంధించిన కార్యక్రమాన్ని కవరేజీలో భాగంగా వీడియో తీస్తున్న జర్నలిస్టులను అసభ్య పదజాలంతో దూషించడంతోపాటు ఒకరిపై చేయి చేసుకోవడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



హన్మకొండ: విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్ఈఈయూ)-327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డిని శ్రీధర్ ఆదివారం కలిసి వినతి పత్రం అందించారు.

'నాగుర్ల' జన్మదిన వేడుకలు



హన్మకొండ: రాష్ట్ర రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు తన పుట్టిన రోజు వేడుకలను జరుపుకున్నారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల మధ్య, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో ఆయన ఆదివారం కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో టీజీఏ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి యాదవరెడ్డి, పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజనీకాంత్, నాయకులు నయీమొద్దీన్, జానకీ రాములు, కుసుమ లక్ష్మీనారాయణ, రవీందర్ రావు, సుహాస్, శ్రీధర్, కేశవరెడ్డి, రఘు, మహేష్, ప్రశాంత్, రాకేష్, శ్రీకాంత్‌చారి పాల్గొన్నారు.

మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి



సావిత్రీబాయి పూలే దంపతుల విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న సంగని మల్లేశ్వర్, తదితరులు



హన్మకొండ: సావిత్రీబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు



హన్మకొండ చౌరస్తా: సావిత్రీబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కమిటీ బాధ్యులు

కేయూ క్యాంపస్: భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే అని కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ మురళీమనోహర్, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ రాంచంద్రం అన్నారు. సావిత్రీబాయి పూలే వర్ధంతి సందర్భంగా కేయూ బీసీసెల్ ఆధ్వర్యంలో పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీసెల్ డైరెక్టర్ శ్రీనివాస్, హాస్టళ్ల డైరెక్టర్ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు. అలాగే, పూలే ఆశయ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్, రిటైర్డ్ ప్రొఫెసర్ వెంకటనారాయణ, ప్రొఫెసర్ వడ్డె రవీందర్, తదితరులు పూలే దంపతులకు ఘన నివాళులర్పించారు. సావిత్రీబాయికి టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నబోయిన తిరుపతి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రఘుపతి గొడిశాల సత్యనారాయణ, బాధ్యులు శ్రద్ధాంజలి ఘటించారు.

విద్య గొప్పతనాన్ని చాటిచెప్పిన సావిత్రీబాయి

హన్మకొండ: చదువు గొప్పతనాన్ని సామాజికవేత్త సావిత్రీబాయి పూలే చాటిచెప్పారని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో సావిత్రీబాయి పూలే వర్ధంతిని ఆదివారం జరుపుకున్నారు. ముందుగా సావిత్రీబాయి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యను అన్ని వర్గాలకు చేరువ చేసిన గొప్ప సంఘసంస్కర్త సావిత్రీబాయి పూలే అని కొనియాడారు. మహిళలకు విద్య అవసరమని చెప్పి పాఠశాలలను ప్రారంభించిన మహోన్నతురాలు అని గుర్తుచేశారు. కార్యక్రమంలో రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, టీజీఏ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి యాదవ రెడ్డి, బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజనీకాంత్, నాయకులు నయీమొద్దీన్, జానకీ రాములు, కుసుమ లక్ష్మీనారాయణ, రవీందర్ రావు, సుహాస్, శ్రీధర్, కేశవరెడ్డి, రఘు, మహేష్, ప్రశాంత్, రాకేష్, శ్రీకాంత్ చారి పాల్గొన్నారు.

సావిత్రీబాయికి నివాళి

హన్మకొండ: సావిత్రీబాయి పూలేకు ప్రజా సంఘాల నాయకులు నివాళులర్పించారు. అంబేడ్కర్ కూడలిలోని బుద్ధ విగ్రహం వద్ద సావిత్రీబాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజా సంఘాల నాయకులు చిట్యాల బాబు, ఎడ్ల అర్జున్, డాక్టర్ నవీన్, ప్రభాకర్, మిద్దెపాక ఎల్లయ్య పాల్గొన్నారు.

హనుమాన్‌నగర్ ఫేజ్ -1 కాలనీలో..

హన్మకొండ చౌరస్తా: సంఘ సంస్కర్త, భారత మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే వర్ధంతిని హనుమాన్‌నగర్ ఫేజ్ -1 కాలనీలోని నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రీబాయి పూలే చిత్రపటానికి కమిటీ బాధ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కమిటీ బాధ్యులు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, మనోహర్, కుమార్‌రెడ్డి, రాజయ్య, రవీందర్, రాజ్‌కుమార్, శ్రవణ్, రవికిరణ్, గణేష్ పాల్గొన్నారు.

'హరీశ్‌రావు' వ్యాఖ్యలపై నిరసన



ధర్నా చేస్తున్న టీఆర్‌టీఎఫ్ నాయకులు

కేయూ క్యాంపస్: ఒకటవ తారీఖున ఉద్యోగులకు ప్రభుత్వం జీతం ఇవ్వడంపై మాజీ మంత్రి హరీశ్ రావు వ్యాఖ్యలను తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) ప్రతినిధులు ఖండించారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీలో ఎస్‌డీఎల్‌సీఈ వద్ద టీఆర్‌టీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆదివారం ధర్నా చేశారు. టీఆర్‌టీఎఫ్ అధ్యక్షుడు కటకం రమేష్ మాట్లాడుతూ ఉద్యోగులకు ఒకటో తేదీన వేతనాలు ఇస్తున్నందునందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి అశోక్‌కుమార్, చీఫ్ ప్యాట్రన్ లక్కిరెడ్డి సంజీవరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సమత, ఏపీ, తెలంగాణ కోకన్వీనర్లు విష్ణుమూర్తి, కిషన్, రాజు, భాస్కర్‌రావు, మధు, కృష్ణమూర్తి, రవీందర్, ప్రభాకర్ రావు, రాంరెడ్డి, మురళి, రామ్మూర్తి పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో..

మాజీ మంత్రి హరీశ్‌రావు మాటలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నబోయిన తిరుపతి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రఘుపతి, గొడిశాల సత్యనారాయణ తెలిపారు. కేయూలోని ఎస్‌డీఎల్‌సీఈ వద్ద ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతినెలా ఒకటవ తేదీన వేతనాలు చెల్లించడం అనేది ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. భీమళ్ల సారయ్య, జగపతిరావు, బిల్ల సుబ్బారావు, జయప్రకాశ్, సత్తార్, కొమురం, లక్ష్మణ్, భాస్కర్, శ్రీరామ్, వెంకన్న, అంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో రాణిస్తున్న మహిళలు



హసన్‌పర్తి: మహిళలను సన్మానిస్తున్న ప్రతినిధులు



కాజీపేట: వడ్డేపల్లి ట్యాంక్‌బండ్‌పై..

హన్మకొండ: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని న్యాయ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి అన్నారు. హనుమకొండ శ్యామల దుర్గాదాస్ కాలనీలోని శ్యామల గార్డెన్‌లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. అనంతరం మెడ్‌హెల్త్ హాస్పిటల్ డాక్టర్లు శ్రీపాల్, మానస ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు అన్నం రవీంద్రనాథ్, కార్యదర్శి శిరీష్ కుమార్, కోశాధికారి నరేష్, హరిబాబు, సూర్య, శ్రీనివాస్, మంజుల, శోభారెడ్డి, సతీష్ పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు అండగా..

కాశిబుగ్గ: మహిళా ఉద్యోగులకు సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ అండగా ఉంటోందని యూనియన్ వరంగల్ బ్రాంచ్ కార్యదర్శి యుగేందర్ అన్నారు. యూనియన్ మహిళా శక్తి కోఆర్డినేటర్ సంగీత అధ్యక్షతన వరంగల్ రైల్వే స్టేషన్ ఆవరణలోని యూనియన్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. అనంతరం మహిళా ఉద్యోగులతో కలిసి కేక్ కట్ చేసి వారిని సన్మానించారు. కార్యక్రమంలో వరంగల్ బ్రాంచ్ చైర్మన్ ముకుందం, వైస్ చైర్మన్ సుధాకర్, అహ్మద్, సురేష్, రాజేష్, ఇందిర, గీత, స్వాతి, శారద, లక్ష్మి, భద్రావతి, యాదమ్మ, లక్ష్మి, కరుణ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సన్మానం

హసన్‌పర్తి: మహిళా దినోత్సవాన్ని హసన్‌పర్తిలోని టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలను సన్మానించారు. టీచర్స్ అసోసియేషన్, హసన్‌పర్తి శాఖ అధ్యక్షుడు రవీందర్, గౌరవ అధ్యక్షుడు సదానందం, ప్రధాన కార్యదర్శి సురేష్, కోశాధికారి లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళా వాకర్స్‌కు..

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ వడ్డేపల్లి ట్యాంక్ బండ్‌పై మహిళా వాకర్స్‌కు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొల్లెపల్లి రాజేష్ ఆధ్వర్యంలో మహిళలకు శాలువలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎస్.సారయ్య, మహమూద్ అలీ, జి.రవీందర్ రెడ్డి, ఎనివాస్ రెడ్డి, వెంకటరెడ్డి, కొండ్ర శంకర్, కైలాష్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు దేశవ్యాప్తంగా మద్దతు



హన్మకొండ: నిరసన తెలుపుతున్న నాయకులు



వరంగల్ చౌరస్తా: మాట్లాడుతున్న రమేష్

హన్మకొండ: ఢిల్లీలో రైతులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా దేశవ్యాప్తంగా అన్ని సంఘాలు, పార్టీలు వివిధ రూపాల్లో కార్యక్రమాలు చేపడుతున్నాయని వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ తెలిపారు. హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రైతులకు మద్దతుగా ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతియుతంగా సమస్యల సాధనకు పోరాటం చేస్తున్న రైతులపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం లాఠీచార్జ్ చేసి, భాష్పవాయువు ప్రయోగించి దాడి చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దాడిని దేశమంతా ఖండిస్తోందని తెలిపారు. వెంటనే కనీస మద్దతు ధర చట్టం తేవాలని డిమాండ్ చేశారు. దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి చుంచు రాజేందర్, అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిద్దెపాక ఎల్లయ్య, వీసీకే రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మచ్చ దేవేందర్, తెలంగాణ మాల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దర్గాస్వామి, కేయూ జేఏసీ నాయకులు మంద వీరస్వామి, అంబేడ్కర్ యువజన సంఘం హనుమకొండ అధ్యక్షుడు అర్జున్ పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వ పతనం ఖాయం

వరంగల్ చౌరస్తా: రైతు వ్యతిరేక కేంద్రంలోని మోదీ ప్రభుత్వ పతనం ఖాయమని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్ అన్నారు. పంటలకు కనీస మద్దతు ధర చట్టం చేసి రైతులను రుణ విముక్తి చేయాలనే డిమాండ్‌తో ఈనెల 14న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ అధ్యక్షతన వివిధ రైతు వ్యవసాయ కార్మిక సంఘాల సంయుక్త జిల్లా సమావేశం అబ్బని కుంటలోని రైతు భవన్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ స్వామినాథన్ సూచనలను కేంద్ర ప్రభుత్వం తుంగలో తొక్కిందని ఎద్దేవా చేశారు. రైతు వ్యతిరేక చట్టాలను విధానాలను నిరసిస్తూ రైతాంగాన్ని రక్షించి దేశాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తూ చారిత్రాత్మక రైతు ఉద్యమం కొనసాగుతోందన్నారు. సమావేశంలో నాయకులు గోనె కుమారస్వామి, జిల్లా కన్వీనర్లు బాబురావు, వీరగోని శంకరయ్య, రాచర్ల బాలరాజు, చిర్ర సూరి, జిల్లా నాయకులు ఓదెల రాజన్న, మంద రవి, ఊరటి అంశాల్ రెడ్డి, సిరుల రవీందర్ కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



హన్మకొండ అర్బన్: హనుమకొండ 60వ డివిజన్ పరిధిలోని టీచర్స్‌కాలనీ ఫేస్ -2లో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. డివిజన్‌లో చేపట్టాల్సిన పనులు, నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యేకు కార్పొరేటర్ అభినవ్ భాస్కర్ వివరించారు.

బండ కార్మికులకు పట్టాలు ఇప్పించండి

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం న్యూశాయంపేటలోని సర్వేనంబర్ 579లో బండను కొట్టి చదును చేసిన కార్మికులకు ఆ భూమి పట్టాలు ఇప్పించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఈమేరకు న్యూశాయంపేటలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెస్పీ నాయకులు మంద కుమార్‌మాదిగ, సూరన్న, మంద రాజు, సుకుమార్, రాజు, సుదర్శన్, విశాల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

కాజీపేట అర్బన్: 31వ డివిజన్ న్యూశాయంపేటలో బీఆర్ఎస్ పార్టీ నుంచి పలువురు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ఆహ్వానించారు. కార్పొరేటర్ మామిండ్ల రాజు, నాయకులు సత్తు రమేష్, పిండి రమేష్, గండ్రతి యాదగిరి, రాజు, మహేష్ పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

ఖిలా వరంగల్: మహిళా కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి నలిగంటి రత్నమాల పిలుపునిచ్చారు. ఉర్సుగుట్ట రామ సురేందర్ భవనంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు సంగీత, వాణి అధ్యక్షతన ప్రజా సంఘాల జిల్లా సదస్సు ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రత్నమాల మాట్లాడుతూ మహిళలపై 30శాతం హింస పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు పెంచి పేదలపై పాలకులు మోయలేని భారాలు మోపారని వాపోయారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి, చుక్క ప్రశాంత, సరిత, కల్పన, అనిత, కీర్తి, అస్మ, కవిత, విజయ, బేగం పాల్గొన్నారు.

దేవాలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు



మెట్టుగుట్టపై ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



కాశిబుగ్గ: రంగనాథ ఆలయంలో చండీహోమం

మడికొండ: మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మడికొండలోని మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం మహా పూర్ణాహుతి నిర్వహించి స్వామి వారికి త్రిశూల స్నానం చేయించారు. అనంతరం అన్నపూజ చేసి ప్రత్యేకంగా అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం పుష్పోత్సవం, పవళింపు సేవ, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహణాధికారి శేషుభారతి, ఆలయ చైర్మన్ పైడిపాల రఘుచందర్, ప్రత్యేకాధికారి కవిత, అర్చకులు రాగిచేడు అభిలాష్ శర్మ, పరాశరం విష్ణువర్ధనచార్యులు, పారుపల్లి సత్యనారాయణ శర్మ, మణిశర్మ, ధర్మకర్తలు బైరి రాజు, రొడ్డ దయాకర్, దండిగం శ్రీనివాస్, బోగి కేదారి, వస్కుల ఉమ, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

రంగనాథస్వామి ఆలయంలో చండీహోమం

కాశిబుగ్గ: ఆదివారం అమావాస్య పురస్కరించుకుని గ్రేటర్ వరంగల్ 20వ డివిజన్ కాశిబుగ్గ రంగనాథ స్వామి దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా చండీహోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హోమంలో పాల్గొని పూజలు చేశారు. పూజలో కమిటీ అధ్యక్షులు వంగరి రవి, చిలుపూర్ సురేష్, అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు, సుల్తానా సమ్మక్క, కవిత, స్రుజన, శ్రీనివాస్, సమ్మయ్య, భాస్కర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని గణిత విభాగంలో విద్యనభ్యసించి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన పలువురు విద్యార్థులను గణిత విభాగం అధ్యాపకులు ఆదివారం అభినందించారు. ముఖ్యఅతిథిగా కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి మాట్లాడుతూ భావితరాలను తీర్చిదిద్దే ఉపాధ్యాయులుగా పనిచేసి మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. గురుకుల డిగ్రీ కళాశాల లెక్చరర్లుగా ఆరుగురు, జూనియర్ లెక్చరర్లుగా 18మంది, పీజీటీ, టీజీటీగా ఆరుగురు ఉద్యోగాలు సాధించారు. కేయూ గణితం అధ్యాపకులు డాక్టర్ తిరుమలాదేవి, సౌజన్య, సోమయ్య, రిటైర్డ్ ప్రొఫెసర్ ఉమామహేశ్వరి ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



హన్మకొండ: పూర్వ విద్యార్థులు, గురువులు

మామునూరు: టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1996 -97వ సంవత్సరం పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. పూర్వ విద్యార్థులు ఒకచోటుకు చేరి నాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా నాటి గురువులు చలపతిరావు, దివాకర్‌రెడ్డి, ఉదయ్ కిరణ్, సుజాతను విద్యార్థులు సన్మానించారు.

రేగొండ కాకతీయ గురుకుల విద్యాలయం..

హన్మకొండ: రేగొండ కాకతీయ గురుకుల విద్యాలయం 2001 -2002 విద్యా సంవత్సరం 10వ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం హనుమకొండ నక్కలగుట్టలోని ఒక హోటల్‌లో ఆదివారం జరిగింది. రెండు దశాబ్దాల తర్వాత పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఒకచోటుకు చేరి నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా నాటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుపతి రెడ్డి, అశోక్, జాని, మధు, కుమార్, రాజమౌళి, పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వాహక కమిటీ సభ్యులు భేతి సతీష్, తోట విష్ణు, కొమ్మిడి నరేందర్ రెడ్డి, వంటకాల రత్నాకర్, మాదాసు యుగేందర్, రాజు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

విజయ సంకల్ప సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

వరంగల్: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పాల్గొనే విజయ సంకల్ప సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్ పిలుపునిచ్చారు. ఎల్బీనగర్‌లో ఆదివారం సన్నాహక సమావేశం తూర్పు కన్వీనర్ పొట్టి శ్రీనివాస్‌గుప్త అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో మంగళవారం సభ జరగనుందని తెలిపారు. సమావేశంలో నాయకులు రత్నం సతీష్ షా, కనుకుంట్ల రంజిత్, ఎరుకల రఘునరెడ్డి, రత్న కిషోర్, బైరి శ్యాంసుందర్, గోకె వెంకటేష్, డివిజన్ ఇన్‌చార్జ్‌లు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

గద్దర్ ఆలోచన వేదిక కరపత్రం ఆవిష్కరణ

ఖిలా వరంగల్: పడమర కోటలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గద్దర్ ఆలోచన ఐక్య వేదిక ఆధ్వర్యంలో రూపొందించిన గద్దర్ ఆలోచన కరపత్రాన్ని ఆ సంస్థ కో కన్వీనర్ సుద్దాల నాగరాజు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాల కోసం గద్దర్ అనేక ఉద్యమాలు చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో మైదం శ్యామ్, మైదం బాబు, గుడికందుల కిరణ్, నలిగంటి విజయ్, నలిగంటి రాజు, మైదం సంజీవ, దుబాకి బాబు, కేశపాక రాజు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ సోమిడి గ్రామంలోని సోమేశ్వర స్వామి దేవాలయంలో పలు అభివృద్ధి పనులను కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ దంపతులు ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు అయినవోలు రాధాకృష్ణ శర్మ, మాజీ కార్పొరేటర్ జక్కుల రమ, సుంచు చంద్రయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన అజ్మీరా సీతారాం నాయక్

హన్మకొండ: మాజీ ఎంపీ ప్రొఫెసర్ అజ్మీరా సీతారాం నాయక్ బీజేపీలో చేరారు. ఆదివారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ.నడ్డా సమక్షంలో సీతారాం నాయక్ బీజేపీలో చేరారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు కోవ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

జానీద్‌షా గ్రేవియార్డ్ కమిటీ నియామకం

ఖిలా వరంగల్: వరంగల్ ఫోర్ట్‌రోడ్డు శాకరాశికుంట హజ్రత్ ఫీర్ జానీద్‌షా దర్గా, కబ్రస్థాన్ (గ్రేవియార్డ్) నూతన కమిటీని నియమించారు. గౌరవ అధ్యక్షుడిగా మహ్మద్ షకీల్ అహ్మద్, ముఖ్య సలహాదారుడిగా ఎంఏ.జబ్బార్, అధ్యక్షుడిగా మీర్జా హసన్ అలీబేగ్, ఉపాధ్యక్షుడిగా ఎండీ.ముగ్దుం అహ్మద్, ప్రధాన కార్యదర్శిగా ఎండీ.చాంద్ పాషా, కోశాధికారి ఎండీ.అమ్జద్, సహాయ కోశాధికారిగా మొహినొద్దీన్, సహాయ కార్యదర్శిగా సాదిక్ ఇమ్రాన్, గఫార్, ఆర్గనైజర్‌గా దస్తగిరి, కమిటీ సభ్యులుగా యాకూబ్, సలీమొద్దీన్, నహీమ్, అంకూస్‌ను నియమించారు. ఈమేరకు హైదరాబాద్ వక్ఫ్‌బోర్డు అధికారులు ఆదివారం నియామక ఉత్తర్వులు జారీచేశారు.

మార్కండేయ ఆలయంలో అన్నదానం

కాజీపేట: కాజీపేట మండలం సోమిడి గ్రామంలోని భక్త మార్కండేయ దేవాలయ ఆవరణలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం మహాన్నదాన కార్యక్రమాన్ని మాజీ కార్పొరేటర్ సుంచు చంద్రయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో గుర్రపు కోటేశ్వర్, బోయిని కుమార్ యాదవ్‌తో పాటు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

'అమావాస్య పాయసం' పంపిణీ

హసన్‌పర్తి: 65వ డివిజన్ చింతగట్టులోని మహర్షి గోశాలలో అమావాస్య పాయసాన్ని ఆదివారం ఉచితంగా పంపిణీ చేశారు. ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు మాట్లాడుతూ మహర్షి గోశాల ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో మహర్షి గోశాల చారిటబల్ ట్రస్ట్ అధ్యక్షుడు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

జన్ను పరంజ్యోతికి సన్మానం

వరంగల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప జిల్లాలో ఆదివారం జరిగిన జాతీయ విద్యావిధానం సదస్సులో వరంగల్ నగరానికి చెందిన ఒయాసిస్ విద్యాసంస్థల చైర్మన్, ప్రైవేట్ పాఠశాల అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జన్ను పరంజ్యోతి పాల్గొన్నారు. ఈమేరకు ఆయనను ఏపీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌పాషా సన్మానించారు.

వేం నరేందర్ రెడ్డికి..

కాజీపేట: ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్ రెడ్డిని హనుమకొండలోని ఆయన స్వగృహంలో కాజీపేట పట్టణానికి చెందిన పలువురు నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఉద్యమకారుడు గద్దరు సాంబయ్య, మాజీ కార్పొరేటర్ బర్ల యాకుబ్, తదితరులు పాల్గొన్నారు.

అన్నాసాగరంలో ఉచిత వైద్య శిబిరం

హసన్‌పర్తి: శ్రీమౌర్య ఆస్పత్రి, భీమారం ఆధ్వర్యంలో హసన్‌పర్తి మండలం అన్నాసాగరంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురిని పరీక్షించి మందులు అందించారు. అనంతరం ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ మధుకర్ మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామని చెప్పారు.

ప్రభుత్వ స్థలాలను కాపాడాలి

కాజీపేట: కాజీపేట పట్టణంలోని విలువైన ప్రభుత్వ స్థలాలను కాపాడాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈమేరకు రాష్ట్ర రెవెన్యూ శాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి ఎండీ.అంకూస్, కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ పాల్గొన్నారు.

పుస్తెలతాడు అపహరణ

వరంగల్ క్రైం: హనుమకొండ బస్టాండ్‌లో ఆదివారం రాత్రి మహిళ మెడలోంచి పుస్తెల తాడును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ సతీష్ తెలిపారు. కరీంనగర్‌కు చెందిన స్వప్న.. కరీంనగర్ బస్సుల కోసం బస్టాండ్‌లో ఉన్న సమయంలో ఆమె మెడలో ఉన్న సుమారు రూ.90 వేల విలువగల పుస్తెల తాడును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. ఈమేరకు బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

హన్మకొండ: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో మ్యాంటైన్ స్కూల్ వార్షికోత్సవం ఆదివారం జరిగింది. పాఠశాల యాజమాన్యం చల్ల రాజిరెడ్డి, చల్ల శ్రీలత పాల్గొన్నారు.

మంత్రులకు వినతుల వెల్లువ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పలు అభివృద్ధి, శంకుస్థాపన కార్యక్రమాలకు వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వివిధ సంఘాల బాధ్యులు వివిధ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాలు అందజేశారు. అలాగే, మంత్రులు సీతక్క, కొండా సురేఖ కూడా విజ్ఞప్తి చేశారు. కాకతీయ యూనివర్సిటీలో జరగుతున్న అక్రమాలను అరికట్టాలని మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకుల సంఘం (అకుట్) జనరల్ సెక్రటరీ మామిడాల ఇస్తారి వినతిపత్రం అందజేశారు. యూనివర్సిటీలో 2013లో నియమితులైన 80మంది నాన్‌టీచింగ్ ఉద్యోగులకు పీఆర్‌సీని అమలుచేయాలని కాకతీయ యూనివర్సిటీ ఎన్‌జీఓ జనరల్ సెక్రటరీ వల్లాల తిరుపతి, క్లాస్ ఫోర్త్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు అబ్దుల్‌షుకూర్ మంత్రులను కోరారు. కేయూలోని కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని అసిస్టెంట్ ప్రొఫెసర్ల జేఏసీ బాధ్యులు డాక్టర్ సాదు రాజేష్, డాక్టర్ సతీష్ మరో కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ చైర్మన్ డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్ విజ్ఞప్తి చేశారు. కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమకారులకు నివేశన స్థలం, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని కేయూ విద్యార్థి ఉద్యమకారులు డాక్టర్ వలీఉల్లాఖాద్రి, డాక్టర్ సాదు రాజేష్, మంద వీరస్వామి, దుర్గం సారయ్య కోరారు. విద్యారంగ సమస్యల పరిష్కరించాలని వామపక్ష విద్యార్థి సంఘాల బాధ్యులు నర్సింహారావు, వెంకటరెడ్డి, స్టాలిన్, రంజిత్, రాకేష్, రవితేజ, మహేష్, వినయ్, అశోక్.. మంత్రులకు వినతిపత్రం అందజేశారు. కేయూలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ (లంప్సమ్, క్యాజువల్) ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఆయా సంఘాల బాధ్యులు మంత్రులను కోరారు.